క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెలవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామికి జ్యేష్ఠమాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్య స్వామి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

సీఐపై కేసు నమోదు చేయాలి

ప్రొద్దుటూరు రూరల్ : అంగన్‌వాడీ కార్యకర్తను కొట్టిన వన్‌టౌన్ సీఐపై కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తను, ఆమె కొడుకును సీఐ దూషించడం, కొట్టడంతో వారు రైల్వే ట్రాక్‌పై పడుకొని ఆత్మహత్యకు యత్నించారన్నారు. న్యాయం కోసం స్టేషన్‌కు వస్తున్న బాధితులను అవమానకరంగా మాట్లాడటం ఎక్కువయ్యాయన్నారు. సీఐ రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు రాఘవేంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రెండవ అదనపు జిల్లా జడ్జి కే సత్యకుమారి పర్యవేక్షణలో శనివారం కోర్టు ప్రాంగణంలో గాంధీరోడ్డులోని శ్రీహోలిస్టిక్ హాస్పిటల్ సహకారంతో మెడికల్ క్యాంపును నిర్వహించారు. వైద్యులు రాజశేఖర్‌వర్మ, బీఎల్ఎన్‌రెడ్డి, హరీష్‌బాబు, నాగేశేఖర్‌రెడ్డి, నరసింహరావు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు షేక్ ఫైజున్నీసా, ప్రతిభ, కే సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



యూట్యూబర్ సుధాకర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక హోమస్ పేటలోని నాగదస్తగిరి రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యూట్యూబర్ సుధాకర్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్య ఖర్చుల కోసం రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డితో సుధాకర్ ఆరోగ్య విషయంపై రాచమల్లు చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాతకోట ముని వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, నూకా నాగేంద్రారెడ్డి, మన్నే సత్యం, అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గోటూరు వెంకటేష్, దేస్ రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి

బద్వేలు అర్బన్ : మండలంలోని నందిపల్లె గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పంగా సుబ్బారెడ్డి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

పోరుమామిళ్ల : గురప్పగారిపల్లె ఎంపీపీ పాఠశాల నుంచి టేకూరుపేట ఆదర్శ పాఠశాలకు బదిలీ అయిన కుర్రా చెన్నయ్య, బాలచంద్రయ్యలకు శనివారం గ్రామప్రజలు సన్మానం చేశారు. 32 మంది ఉన్న పాఠశాలను 62 మందితో బలోపేతం చేయడమేకాక, విద్యార్థుల ఉన్నతి కృషి చేశారని, వారిని సన్మానించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని గ్రామ పెద్దలు మల్లికార్జునరెడ్డి, అంబరీశరెడ్డి, రవికుమార్, శిఖామణి పేర్కొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ నాగేష్, వైస్‌చైర్మన్ జసింత, హెడ్మాస్టర్ చెన్నయ్య, టీచర్ అరుణ పాల్గొన్నారు.

బలిజ అన్నదాన సత్రం నూతన కమిటీ ఎంపిక

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో ఉన్న కాపు బలిజ అన్నదాన సత్రం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బద్వేల్‌కు చెందిన ధర్మిశెట్టి శ్రీనివాసుల రాయల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు మైదుకూరుకు చెందిన నారాయణరాయల్, ప్రధాన కార్యదర్శి శేగినేని పోతు లూరయ్య, గ్రేటర్ రాయలసీమ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసులేటి శంకర్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామిరాయల్, గండిక్షేత్రం చైర్మన్ కృష్ణతేజ, బద్వేల్‌టౌన్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పోరుమామిళ్ల సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



యోగా చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, అధికారులు, ప్రజలు



బద్వేలులో యోగా చేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ, ఆయాశాఖల అధికారులు, విద్యార్థులు

ప్రొద్దుటూరు క్రైం : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రెండవ అదనపు జిల్లా జడ్జి కే సత్యకుమారి తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రెండవ అదనపు జిల్లా జడ్జి కే సత్యకుమారి ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది యోగ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ ప్రతిభ, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే సురేంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : రాయలసీమ వ్యాయామ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ప్రిన్సిపాల్ రవిశంకర్, యోగాంధ్ర కార్యక్రమ అధికారి డాక్టర్ నరసింహారెడ్డి అధ్యాపకులు పాల్గొని విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌కాలేజీలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు. లేపాక్షి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, అధ్యాపకుడు నాగభూషణ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు. పెన్నానగర్‌లోని ఉర్దూ పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి విద్యార్థులకు యోగ సాధన వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో యోగాంధ్ర-2025కు విశేష స్పందన లభించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది హాజరై యోగాసనాలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో, కొత్తపల్లె , గోపవరం పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు యోగాసనాలు వేశారు.

35 ఏళ్లుగా యోగా చేస్తున్నా

ప్రొద్దుటూరు : 35 ఏళ్లుగా తాను యోగాను నిత్యం చేస్తున్నానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఇంత ఆరోగ్యంగా ఉండేందుకు కారణం యోగా అని తెలిపారు. జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పాల్గొన్నారు.

■ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, డీఎస్ కేవీ రమణయ్య ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యోగా గురువు రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

■ మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో యోగా గురువు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ రాజకిశోర్, డాక్టర్ జీవన, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి విద్యార్థులకు యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ, కళాశాల డైరెక్టర్ పృధ్వీనారాయణ, కోఆర్డినేటర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

యోగా గురువులకు సన్మానం

స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో యోగా శిక్షకులు మునిశేఖర్, బాబు, వెంకటరమణ, ప్రసాద్, స్వప్నలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీఈ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ పంజగల మధుసూదన్, డాక్టర్ కూరపాటి శ్రీనివాసులరెడ్డి, భజరంగదళ్ భాస్కర్‌రెడ్డి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సర్వరోగ నివారిణి యోగ

ప్రొద్దుటూరు క్రైం : మానవునికి సోకే ప్రతి వ్యాధికి యోగాలో చికిత్స ఉందని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ త్యాగరాజరెడ్డి తెలిపారు. ఐఎంఏ హాల్‌లో శనివారం వైద్యులు యోగాసనాలు చేశారు. ఐఎంఏ కోశాధికారి డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి , యోగా శిక్షకురాలు స్వప్న మాతాశ్రీ, వైద్యులు పాల్గొన్నారు.

వాడవాడలా యోగాకు విశేష స్పందన

బద్వేలు అర్బన్ : మానవుని జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని, అప్పుడే మానవుడు ప్రశాంతంగా జీవనం సాగించగలడని బద్వేలు ఆర్డీవో ఎ.చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వివిధ శాఖల అధికారులు, వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బివిఆర్ విద్యా సంస్థల సెక్రటరీ కె.రితేష్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీవీ నరసింహారెడ్డి, తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, రూరల్ సీఐ నాగభూషణ్, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్, యోగా గురువులు అమర్‌నాథరెడ్డి, నందగోపాల్ పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొని యోగా నిర్వహించారు. నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ మైథిలి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కరరావుల నిర్వహణలో మహిళలు, విద్యార్థులు, నాయకులు, యోగా సాధకులు, ఉద్యోగులు దాదాపు 1000 మంది పాల్గొన్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, ఎంఈఓలు వెంకటయ్య, కొండిశెట్టి, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, పోరుమామిళ్ల, రంగసముద్రం సర్పంచులు సుధాకర్, రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చాపాడు : యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానం వద్ద యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ తమ దేశంలో పుట్టిన యోగా ప్రపంచానికి తెలియజేశారన్నారు. అంతర్జాతీయంగా యోగా దినోత్సవం జరుపుకోవడం గొప్పవిషయమన్నారు. యోగాపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించి వారితో యోగా చేయించారు. యోగా గొప్పతనంపై తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దారు రమాకుమారి, ఎంపీడీఓ వీరకిషోర్, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాజుపాళెం : యోగా చేయడంతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని మండల విద్యాశాఖ అధికారి రామస్వామిరెడ్డి తెలిపారు. మండలంలోని సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెల్లాల బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ, ఉపాధ్యాయినులు, సీఆర్పీలు సుబ్బరాయుడు, భార్గవిలత పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా ఎంతో మంచిది

మైదుకూరు : నిత్య జీవితంలో యోగా ఎంతో మంచిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మైదుకూరులో శనివారం పలు చోట్ల యోగా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ మైదానంలో, వనిపెంట, జీవీ సత్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యోగాసనాలు వేశారు.

యువత పోరు జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

పోరుమామిళ్ల : ఈనెల 23న కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే 'యువత పోరు ధర్నా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపిచ్చారు. శనివారం రాత్రి ఈ మేరకు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి యువజన విభాగం ఎంతో కీలకమన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ ప్రజల గురించే ఆలోచిస్తుందన్నారు. కూటమి పాలనలో అన్నివర్గాలు మోసాలకు గురవుతున్నాయన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో యువత పోరు ధర్నా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్నామన్నారు. యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ ధర్నా జరుగుతుందన్నారు.

కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, కేసులకు ఎవ్వరూ భయపడవద్దన్నారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదన్నారు. 6800 టీచర్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను, ఎండీయూ ఆపరేటర్లను, మద్యం షాపుల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌లను తొలగించి నిరుద్యోగులను చేశారన్నారు. తల్లికి వందనంలో 60 లక్షల మంది ఉంటే 30 లక్షల మందికేరూ. 13 వేలు అందించారన్నారు. అప్పట్లో రూ. 2 వేలు జగన్ జేబులోకి వెళ్తుందని ఆరోపించిన కూటమి నేతలు ఇప్పుడు రూ. 2 వేలు ఏం చేశారన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా జయప్రదం చేసేందుకు కార్యకర్తలంతా రావాలన్నారు. పోస్టర్ల విడుదల కార్యక్రమంలో యువ నాయకులు గిరిప్రణీత్‌రెడ్డి, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, యువజన విభాగ కార్యవర్గసభ్యుడు జగదీష్‌రెడ్డి, వలంటరీ వింగ్ అధ్యక్షుడు శివ, మైనారిటిసెల్ అధ్యక్షుడు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన శనివారం తన స్వగృహంలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం నిరుద్యోగ భృతి రూ.3వేలు అందించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 23న యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.సందీప్, జిల్లా యువజన విభాగం ఈసీ మెంబర్ బాలాజీ నివాస్, మండల అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, రాజుపాళెం మండల అధ్యక్షుడు యోగానందరెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దావూద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, బాషా, సెల్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీనివాసుడి కల్యాణం



శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం 9-30 గంటలకు ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 36ను అమలు చేసి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలను రూ.21,000 – 24,500 ఇవ్వాలని అన్నారు. రిస్క్ అలవెన్స్, కరువు భత్యం ఇవ్వడం లేదన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను వర్తింపజేస్తూ ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్లడానికి ఇంజనీరింగ్ కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీటెక్ శివన్న, గంగాధర్, వెంకటేశు, గురప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న కల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు నిర్వాహకురాలు శివదర్శనానంద సరస్వతి మాతాజీ తెలిపారు. శనివారం స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో గాజుపల్లె పెద్దసుబ్బయ్య, పెద్ద సుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతి మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. సేవా సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు మాట్లాడుతూ పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు 15 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు పండితురాలు ఎస్.నాగరత్నం, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలను సన్మానించారు. అలాగే ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్యం చేస్తున్న వెంకటరాముడు, ఉచిత యోగా విద్య నేర్పిస్తున్న ఉండేల మునిశేఖర్‌రెడ్డిలను సత్కరించారు. మండలంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 43 మంది విద్యార్థులకు రూ.63వేలు ప్రతిభా పురస్కారాలతోపాటు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో గాజులపల్లె రామచంద్రుడు కుటుంబీకులు, సంస్థ ప్రతినిధులు నరసింహులు, నల్లం శివశంకర్, సుబ్బరాయుడు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 24న ద్విచక్రవాహనాల వేలం పాట

బద్వేలు అర్బన్ : బద్వేలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన మూడు ద్విచక్రవాహనాలకు ఈ నెల 24న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బి.సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటం రోడ్డులోని మార్కెట్ యార్డు కాంపౌండ్‌లో గల ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 11.30 గంటలకు నిర్వహించే ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్దేశిత రుసుమును చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంను సంప్రదించాలని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రొద్దుటూరు రూరల్ : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో జరిగే పలు రకాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

బద్వేలు అర్బన్ : రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక సీపీఎం పట్టణ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సామాజిక భద్రతకు ముప్పు తెస్తున్న పాలకులు ఎన్నికల్లో ధనం, కులం, మతం ఆధారంగా గెలిచి ప్రజాసంక్షేమాన్ని, ప్రజా సేవను విస్మరిస్తున్నారన్నారు. ప్రజలందరికీ నిత్యావసర సరుకులు చౌకదుకాణాల ద్వారా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీసభ్యులు చాంద్‌బాషా, రూరల్ కార్యదర్శి వెంకటేష్, పట్టణ కమిటీసభ్యులు బాబు, అట్లూరు మండల కన్వీనర్ రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కంపచెట్ల తొలగింపు



కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి భవనాల వెనుకవైపు ఇటీవల కంపచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతం పెరిగిపోయాయి. అటువైపు పోస్టుమార్టం గది ఉండటంతో ఇబ్బంది ఏర్పడింది. ప్రజల నుంచి ఆరోపణలు రావడంతో పాటు రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి దృష్టికి ఆసుపత్రి సిబ్బంది తీసుకపోయారు. ఆయన సూచనతో వార్డు మెంబర్ భర్త సురేష్‌బాబు శనివారం మినీ జేసీబీతో కంపచెట్లు తొలగించగా, పంచాయతీ సిబ్బంది పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఆసుపత్రి సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



ఈదుళ్లపల్లె నోటుపుస్తకాలతో విద్యార్థులు

పోరుమామిళ్ల : పసుపులేటి వెంకటమ్మ(సంటెమ్మ) సేవాసంస్థల నిర్వాహకుడు జీవీ రమణ శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3000 నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. రంగసముద్రం దళితవాడ, ఎస్టీకాలనీ, కొండుగారిపల్లె, రాజాసాహెబ్‌పేట, యరసాల, సూరిశెద్దుపల్లె, తిమ్మారెడ్డిపల్లె, తోకలపల్లె, సిద్దవరం, కమ్మవారిపల్లె, ఈదుళ్ళపల్లె, ఎఎపాలెం, బొప్పాపురం, నర్సింగుపల్లె, అక్కలరెడ్డిపల్లె, నాగలకుంట్ల, పోరుమామిళ్ల మెయిన్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు వెంకటయ్య, కొండిశెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి



మాట్లాడుతున్న పోతిరెడ్డి భాస్కర్

మైదుకూరు : కౌలు రైతులు, డీకేటీ, చుక్కల భూములు కలిగిన రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం అందించాలని సీపీఐ అనుబంధ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా నుంచి రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులు, డీకేటీ, చుక్కల భూములు కలిగిన రైతులను తొలగించినందుకు నిరసనగా సోమవారం కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భూమిలేని నిరుపేద వ్యవసాయదారులైన దళితులు, బడు, బలహీన వర్గాల వారికి, అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం డీకేటీ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వారిని అన్నదాత సుఖీభవ పథకం నుండి తొలగించడం అంటే అంతకంటే అన్యాయం మరొకటి లేదన్నారు. ధర్నా కార్యక్రమంలో డీకేటీ, చుక్కల భూములు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు గోశెట్టి రామ్మూర్తి, ఎన్.సుబ్బారెడ్డి, నాయకులు గుజ్జుల లక్ష్మయ్య, కొట్టే రామమోహన్ పాల్గొన్నారు.

జీలుగల పంపిణీ ప్రారంభం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో శనివారం నుంచి రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువుల సాగు కోసం 50 శాతం సబ్సిడీతో ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు, ఆ పార్టీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డితో కలసి జీలుగల విత్తన పంపిణీ ప్రారంభించారు. మండలానికి 800 క్వింటాళ్లు అవసరం కాగా 150 క్వింటాళ్ల జీలుగల మంజూరయ్యాయన్నారు. వచ్చే వారంలో మరిన్ని విత్తనాలు మంజూరయ్యే అవకాశం ఉందని, మొదటగా మడూరు, అన్నవరం గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పంపిణీ చేపట్టామన్నారు. సోమవారం నుంచి కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించుకుని జీలుగలను 50 శాతం సబ్సిడీతో కిలో రూ.61.50లతో తీసుకెళ్లవచ్చని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23న మండల సీపీఐ మహాసభలు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల : ఈనెల 23న సీపీఐ పోరుమామిళ్ల మండల శాఖ 10వ మహాసభలు ఎస్టీయూ భవన్‌లో జరుగుతాయని, కార్మికులు, రైతులు, అభిమానులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని పార్టీ నాయకులు కేశవ, చెన్నయ్యలు పిలుపిచ్చారు. శనివారం ఈ మేరకు కరపత్రాలు విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పాల్గొంటారన్నారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న సీపీఐ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటారన్నారు.